ఆస్పత్రుల్లో నిఘా వ్యవస్థ అవసరం



ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలందించే డాక్టర్లకు, నర్సింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాలి. సీసీ కెమెరాలతో గట్టి నిఘా వ్యవస్థను ఆస్పత్రులతో అనుసంధానం చేయాలి. ఇటీవల కొందరు మద్యం, గంజాయి సేవించి ఆ మత్తులో అరాచకాలకు పాల్పడుతున్నారు. అటువంటి వారు ఆస్పత్రుల్లోకి ప్రవేశించే వీలు లేకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బయటి వారు ఆస్పత్రుల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ రమ్య, మెడికల్ ఆఫీసర్, యూపీహెచ్‌సీ

వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి



పగలు, రాత్రి వేళల్లో నిత్యం వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందిస్తుంటారు. అటువంటి వైద్య సిబ్బందికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. తగిన రక్షణ కల్పించినప్పుడే స్వేచ్ఛగా సేవలందించగలం. రాత్రి పూట వైద్య సేవల అవసరం ఉన్నవారు తప్ప మరెవరికీ ఆస్పత్రుల్లోకి ప్రవేశం కల్పించకూడదు. ఏదైనా ఆపద సంభవిస్తే సెక్యూరిటీని అప్రమత్తం చేసేలా సైరన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– గౌషియా, హెల్త్ సెక్రటరీ

ప్రశాంతి పార్కుకు కొత్త అందాలు



ఓపెన్ జిమ్ పరికరాలు

- రూ.20 లక్షలతో సౌకర్యాల కల్పన
- పెరిగిన సందర్శకుల తాకిడి



వివేకానందుడి ఆధ్యాత్మిక మందిరం



ప్రశాంతి పార్కులోని ఆధ్యాత్మిక మందిరాలు



ప్రశాంతి పార్కులోని వివేకానందుడి విగ్రహం

మురళీనగర్ : మురళీనగర్ సెక్టార్ – 3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ఆహ్లాదానికి, ఆధ్యాత్మికతకు నిలయంగా భాసిల్లుతోంది. ఈ పార్కులో ఇటీవల జీవీఎంసీ ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు నిర్వహించి సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పార్కు కొత్త అందాలు సంతరించుకుంది. స్థానిక నిర్వాహకులతోపాటు, వివేకానంద యువ మహామండలి సభ్యులు పార్కు పరిశుభ్రత, నిర్వహణకు సహకరిస్తున్నారు. ఏడాది క్రితం వరకు ఈ పార్కులో సౌకర్యాల లేక ఎవరూ వచ్చే వారు కాదు. వివేకానంద యువ మహామండలి అధ్యక్షుడు దివంగత నాయుడు లక్ష్మీనారాయణ కాలంలో నిరంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వెలుగొందిన పార్కును ఆయన మరణం తర్వాత ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. దీంతో ఇక్కడ పచ్చదనం కూడా కనుమరుగైంది. అప్పటికే వివేకానందుడి ధ్యాన మందిరం ఉన్నా తెరిచేవారు లేరు. సందర్శకులు సేద తీరడానికి బెంచీలు లేవు. ప్రహరీ గోడకు పెయింటుంగ్స్ లేక వెలవెలబోయేది. రాళ్లు తేలిన ఇరుకైన నడక మార్గం ఉండేది. దీంతో సందర్శకుల సంఖ్య తగ్గిపోయింది.

జీవీఎంసీ నిధులతో సౌకర్యాలు

జీవీఎంసీ రెండు విడతలుగా నిధులు మంజూరు చేసి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంది. రూ.20 లక్షలకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడంతో నూతన సౌకర్యాలు సమకూరాయి. పూర్తి స్థాయిలో టైల్స్‌తో నడక మార్గం నిర్మించడంతో కొత్త రూపు వచ్చింది. ప్రహరీ గోడకు రంగులు వేశారు. ఓపెన్ జిమ్ అందుబాటులోకి వచ్చింది. వివేకానందుడి ధ్యాన మండపానికి రంగులు వేయడంతో మరింత ఆధ్యాత్మికత సంతరించుకుంది. సందర్శకులు కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పార్కు సుందరీకరణలో భాగంగా పచ్చదనం పెంపునకు చర్యలు చేపట్టారు. పార్కు పశ్చిమం వైపు గేటు, ఆర్చి ఏర్పాటు చేశారు. రెండో విడతలో మంజూరైన నిధులతో మండపం లోపల, బయట ఆర్ట్ వర్క్ చేశారు. దీంతో సందర్శకులు భారీగా పెరిగారు. రోజూ ఉదయం, సాయంత్రం యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. వివేకానందుడి మండపంలో విశాఖ వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో వివేకానందుడి బోధనలకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆకర్షణగా ఆధ్యాత్మిక మందిరాలు

పార్కులో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక మందిరాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రాతి శిల్పాలతో తయారు చేసిన శ్రీకృష్ణుడు, విఘ్నేశ్వరుడుతోపాటు పాలరాతితో తయారు చేసిన షిర్డీ సాయిబాబా, రామకృష్ణ పరమహంస, శారదామాత, శంకరాచార్యుల విగ్రహాలు ఉన్నాయి. సందర్శకులు నిత్యం దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఉత్సవాల సమయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నగరంలో ఎక్కడా కనిపించని వివేకానందుడి నిలువెత్తు విగ్రహం ఇక్కడ ఉంది. వివేకానందుడి బోధనలకు అనుగుణంగా ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అందంగా తీర్చిదిద్దారు



గతంలో వివేకానంద యువ మహా మండలి, స్థానికుల సహకారంతో పార్కు నడిచేది. వ్యాసం శ్రీరామమూర్తి, నాయుడు లక్ష్మీనారాయణ వంటి పెద్దలు పార్కు నిర్వహణకు సహకరించేవారు. ఇప్పుడు జీవీఎంసీ నిధులతో పార్కును మరింత అందంగా తీర్చిదిద్దారు. దీంతో సందర్శకుల సంఖ్య పెరిగింది. ముఖ్యమైన పండగలను ఇక్కడ నిర్వహిస్తున్నాం. స్థానికులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

– డీఎస్ మూర్తి, ఎన్‌జీజీవోస్ కాలనీ

ప్రశాంతత పొందవచ్చు



మా పార్కుకు వచ్చేవారు ఆధ్యాత్మికత, ప్రశాంతత పొందవచ్చు. ఆధ్యాత్మిక మందిరాలను సందర్శించే వారికి అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయి. స్థానికులు ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు. యువకులు ఇక్కడ నిర్వహించే ఆధ్యాత్మిక, జ్ఞాన కార్యక్రమాల్లో పాల్గొని వివేకానందుడి బోధనల పట్ల ఆసక్తి చూపుతున్నారు.

– పి.చంద్రశేఖర్, కార్యదర్శి, విశాఖ వివేకానంద యువ మహామండలి

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాటిచెట్లపాలెం : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను ఆదివారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం మాజీ కన్వీనర్ జీవీ రవిరాజు, డి.రామకృష్ణారెడ్డి, పార్టీ బీసీ సెల్ జనరల్ సెక్రటరీ బొడ్డేటి గంగా మహేష్, కొట్టకలు కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా 'బాలబాట' వార్షికోత్సవం



బాదంగీర్ సాయిని సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బాలల మాసపత్రిక బాలబాట 17వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత, నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంత అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ బాలబాట పదహారేళ్ల ప్రస్థానాన్ని వివరించారు. డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ బాలబాట పత్రిక నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రమణమ్మ రచించిన ''పూలమాల'' (పిల్లల నాటికలు), కల్లేపల్లి స్వర్ణలత రచించిన ''స్నేహ దివ్వెలు'', ఆచార్య సీతారత్నం రచించిన ''ఐసస్ యాత్ర'' పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. తర్వాత బాదంగీర్ సాయి, కల్లేపల్లి స్వర్ణలతను సత్కరించారు. ఆకాశవాణి కార్యనిర్వహణాధికారి బి.రామసూర్య ప్రకాశరావు, గరిమ సాహితీ సంస్థ అధ్యక్షుడు కె.నరసింహ పాల్గొన్నారు.

యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని స్వాగతిస్తున్నాం



రైల్వే స్టేషన్ వద్ద సంబరాలు చేసుకుంటున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ శ్రేణులు

తాటిచెట్లపాలెం : పాత జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ, దాని స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని శనివారం కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా రామమోహన్ రావు ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్ వద్ద యూనియన్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యంత దుర్మార్గమైన, సంఘటిత రంగంలోని కార్మికుల సామాజిక భద్రతకు సవాలుగా నిలిచిన పాత జాతీయ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని రైల్వే మెన్స్ ఫెడరేషన్, తమ యూనియన్ జరిపిన రాజీలేని పోరాటానికి కేంద్రం దిగి వచ్చిందని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ నాయకులు శివగోపాల్ మిశ్రా, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జోనల్ నాయకులు పీకే పట్నాయక్ నాయకత్వంలో చేపట్టిన నిరసనలు, ఆందోళనల ఫలితమే యూనిఫైడ్ పెన్షన్ స్కీం అని వక్తలు తెలిపారు. ఈ పెన్షన్ స్కీం వల్ల యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరడానికి ఆసక్తి చూపిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మరిన్ని పోరాటాలు చేసేందుకు కార్మికులు సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు. సంబరాల్లో కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, శ్రామిక్ యూనియన్ శ్రేణులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్: మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గైనకాలజీ స్పెషలిస్టు డాక్టర్ కె.అనూష, రేడియేషన్ ఆంకాలజీ స్పెషలిస్టు డాక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ అరుణ్ తేజ బృందం 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, డిస్ట్రిక్ట్ – 101 గవర్నర్ టి.రంగారావు, ఎలక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, క్లబ్ కార్యదర్శి ఎ.జయ, కోశాధికారి జి.శీలారాణి, జాలీ వాకర్ ఎం.ప్రమీలారావు, సంయుక్త కార్యదర్శి ఎస్.రత్నకుమారి, జి.శిరీష లత పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతమ్మధార: ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ లంకలపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో నగరానికి చెందిన విద్యావేత్తలు, భాషాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యా విధానంపై ప్రకటన చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టం – 2010 ప్రకారం ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొనసాగించాలన్నారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ప్రజలకు హక్కులతోపాటు బాధ్యతలూ ఉన్నాయని, వాటిని తెలుసుకోవాలన్నారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను తప్పనిసరిగా మాతృభాషలోనే అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యమూర్తి, పి.కన్నయ్య, వేదుల కామేశ్వరరావు, మేడ మస్తాన్ రెడ్డి, హుస్సేన్, చాట్ల బాబురావు రెడ్డి, సుజాత, బ్రహ్మకుమారి, రామేశ్వరి పాల్గొన్నారు.

కామ్రేడ్ పుష్పాంజలి సాహుకు నివాళి



కామ్రేడ్ పుష్పాంజలి సాహు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కంచరపాలెం : కంచరపాలెం జోన్ ఐద్వా కార్యదర్శి, సీపీఎం జోన్ కమిటీ నాయకురాలు ఎ.పుష్పాంజలి సాహు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆమె భౌతికకాయానికి సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, నాయకులు బి.గంగారాం, ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.జగన్, పద్మనాభరాజు, ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి నివాళులర్పించారు. అనంతరం సంతాపసభలో మాజీ కార్పొరేటర్, పార్టీ జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ కామ్రేడ్ పుష్పాంజలి సాహు పార్టీ కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారావు, నరేంద్ర, వెంకటారావు, రమణి, ఐద్వా జిల్లా నాయకులు ప్రియాంక, వరలక్ష్మి, భారతి, విజయలక్ష్మి, విమల, ఆర్.భాగ్యలక్ష్మి, ఎం.సుజాత, జయలక్ష్మి, కమల, అనురాధ, అనంతలక్ష్మి, కంచరపాలెం జోన్ నాయకులు అప్పారావు, సింహాచలం, ఈశ్వరరావు, విజయ, శ్రావణి, సోమేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ శుద్ధ పంచమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి, పూజలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో సురేష్‌బాబా పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

కంటిపై ఒత్తిడి తగ్గించాలి



శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మురళీనగర్: జ్ఞానేంద్రియాల్లో అతి ముఖ్యమైన కంటిపై ఒత్తిడి తగ్గించాలని శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ శశి, సమృద్ధి, ఆర్.దేశ్‌ముఖ్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ఏడాదికోసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 174 మందికి వైద్య పరీక్షలు చేయగా వారిలో 36 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సిఫారసు చేశారు. అనంతరం వైద్యులను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

వైద్యురాలిపై దాష్టీకం దారుణం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, ఉపాధ్యాయులు

సీతమ్మధార: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన దారుణ కృత్యాన్ని వ్యతిరేకిస్తూ పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాష్టీకాలను ఖండించాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పౌర చైతన్య వేదిక నాయకులు సి.హెచ్. ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల వీరభద్రరావు, ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు కోలవెన్ను, డాక్టర్ వెంకట రమణ, సత్యవతి, పొన్నాడ శ్రీనివాసరావు, ధర్మేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్స్ కప్ విజేతలకు బహుమతులు



విజేతలతో సంస్థ సభ్యులు

కంచరపాలెం : రాబిన్ హుడ్ ఆర్మీ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కైలాసపురం డీఎల్‌బీ మైదానంలో ఆటల పోటీలు నిర్వహించారు. సిటిజన్స్ కప్ విజేతలుగా సింగమాంబ ఫుట్‌బాల్ టీం, రన్నర్స్‌గా వెంకట ఎఫ్‌సీ టీం నిలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి చిన్నారులకు నోట్ పుస్తకాలు, ప్లాంకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాబిన్స్ ప్రసాద్, దొడ్డి సంజీవ్‌కుమార్, ఇమ్రాన్, గుప్తా ప్రసాద్, స్వాతి, శంకర్, అశోక్, దీపక్, కోచ్‌లు పాండు, గిరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమాజంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: తగాదాలు, కొట్లాటల్లో రౌడీషీటర్లు తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ధర్మేంద్ర సూచించారు. ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో ప్రమేయం ఉన్న రౌడీ షీటర్లకు సీఐ ఎస్.రమేష్ ఆదేశాల మేరకు ఎస్ఐ ధర్మేంద్ర ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లను ఆదివారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేసి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అందరితో మాట్లాడి వారి రోజువారీ కార్యకలాపాలు, వారు ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారో తెలుసుకున్నారు. సమాజంలో అల్లర్లు సృష్టించినా, గొడవల్లో దూరినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసుల నిఘా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

మురళీనగర్ : పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో (గైస్) సేఫ్టీ కోర్సుల విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఫ్యాక్టరీతోపాటు అక్కడ పనిచేసే ఉద్యోగుల భద్రత సేఫ్టీ విభాగం సిబ్బంది పనితీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. ఇండస్ట్రియల్ సేఫ్టీ, కెమికల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీ కోర్సులు చేసిన వారికి విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం సేఫ్టీ పోకస్ పత్రికను ఆయన ఆవిష్కరించారు. గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్ఆర్ సురేష్, ఆర్.మాధవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయాలు నెరవేరుద్దాం

మురళీనగర్: స్వామి వివేకానందుడి ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి సాధనకు కృషి చేయాలని వివేకానంద యువ మహా మండలి అధ్యక్షుడు పి.మునిస్వామి పిలుపునిచ్చారు. విశాఖ వివేకానంద యువ మహామండలి వార్షిక సమావేశాన్ని మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఎక్కువగా సభ్యులుగా చేరేలా చైతన్యపరచాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో యువ మహామండలి నూతన శాఖలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కాకినాడలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రతినిధి వీఆర్‌కే శర్మ మాట్లాడుతూ భారతదేశం గురించి తెలుసుకోవాలంటే వివేకానందుడి జీవితాన్ని అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.హృదయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంస్కృతంలో శిక్షణ



శిక్షణ శిబిరంలో ట్రస్టు సభ్యులు

సీతమ్మధార: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్ట్, సంస్కృత భారతి సంయుక్తంగా విద్యార్థులకు సంస్కృతంలో ఉచిత శిక్షణను చోడవరం జూనియర్ కళాశాల లెక్చరర్ రేణుక కిషోర్, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్ల వెంకటరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి పది రోజులు పెద్దలకు సంస్కృత తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.